# నిరంజనశాస్త్రి

**రాయసం వెంకటశివుడుగారు**

## ౧

వంశపారంపర్యముగ వచ్చిన మడిమాన్యము లనుభవించి, సాగి లేటి నిర్మలోదకములు త్రావుచు, పరంధామశాస్త్రి ఋజుపవిత్రమనముగ కాలము గడపుచుండెను. చైనమొసంగిన దానితోఁ దనివిచెంది దినములు వెడలబుచ్చుట ఆయన ముఖ్యాశయము. అంటని ద్రాని కట్టులు సాచుట కాయనకుఁ గిట్టదు. పరువెత్తి పాలుద్రావుటకంటె, నిలుచుని నీరుద్రాగుటయె మేలనుకొనువాఁడు. పరోపకారకార్యము లైనను వానినంతగ పరిపడవు. ఇతరులకు మేలుచేయుట శ్లాఘనీయమె యైనను, ఈకలికాలమున, పుణ్యమునకుఁ బోయిన పాపమెదురగును. కావున, మనశ్శాంతియె పరమావధిగ నెంచువారు అకుచాటు పిందె వలెఁ గుడిమి నీ మాన్యాల్లను బుచ్చుట యుక్తము. సత్కార్యాచరణమునలన నొకవిధముగ కష్టకెక్కు, సుఖిదోడుకులఁ బడవలసి వచ్చును. కాఁబట్టి నలుగురినోళ్లలోఁ బడక దినములుగడుపుచు, తాను వచ్చినయట్లె కాల మాసన్నమగునపుడు, సడి దప్పుడులేక, ప్రపంచ రంగమునుండి నిష్క్రమించుట, సాధుసజ్జనమార్గమని యాతని నిశ్చితాభిప్రాయము.

పుత్రుఁడగు నిరంజనశాస్త్రిమాత మదికారు. తన నెంతో గారాబముతోఁ బెనిచి, విద్యాబుద్ధులు గఱపి, పట్టపరీక్షలో విజయమందఁజేసి, తన శ్రేయోభివృద్ధి కెన్నిసాధనసదుపాయములో సమకూర్చిన పితరునియం దమిత ప్రేమానురాగములుండియును, జనకుని దృక్పథము పరిమితమైనదికాదనియు, ఆయనభావములు సంకుచితములు, విపరీతములు ననియు, నిరంజనుఁడు తలంచుచుండెను. లోకమార్గము, ఒక్కొక చోట కంటకమయమైనను, చాలవఱకు ఫలపుష్పయుతసుందరతరు పరివృతమగుటచేగాన, అట సంసారయాత్ర సలుపుటకు మనముసందియ పడఁగూడదు. ఒకవేళ, ప్రపంచమున సౌఖ్యమునకంటె కష్టమె యెక్కువగ నుండినను, ధర్మనిర్వహణమునకై కనులుంచుకొనువారు, క్షణికములగు క్షుద్రసంతోషములకుఁ బోవొల్లరు. సంసారమండలి బాధలకు బాధ్యతలకును భీతిల్లి నూలమాలల దాఁగువారు, శాంతిమాట యటుంచిఁ తుదకు సౌఖ్యమైనఁ బడిగొనఁజాలరు. కావున, ధీరులమై మనము ధర్మరంగమున నిలుచునపుడె, అధర్మశత్రువులు పలాయనమై కష్టములు తొలఁగిపోవును. శాంతిసౌఖ్యధర్మములు, ఏకకాలమున, ఏకకృషి ఫలితముగ, సముపార్జితములగును.

తండ్రికిఁ గొమరునకును బ్రబలమగు నిట్టి యభిప్రాయభేదము లున్నను, అవివారల యన్యోన్య సౌహార్దమించుకయైన నరికట్టలేదు. జనకునికిఁ దనయేకైక పుత్రునియం దపార ప్రేమవత్సలతలును, సుతునికిఁ బితరునం దధిక భక్త్యనురాగములును కుదిరియుండెను. ఇరువురి దృక్కులు,వేర్వేరుస్థానములం దున్నట్టు తోఁచినను, నిజమునకు న్యాయధర్మముల దరికే తిరిగి, ఏకపథమె యాలక్షించుచుండెను. కావున వైరులకు లేఁగాక, వీరొకరి మేలొకరు కోరుచుండిరి. తనయుఁడు విద్యాపరిపూర్తియై, ఉద్యోగమునఁ జేరికాని, స్వగృహమునసె యుండి కాని, వంశపుమర్యాదలు జరపుకొనుచు, నలుగురిచేతను సజ్జనుఁడని పించుకొనుచు, ఇలువేల్పుల దీవన లందునలయునని జనకుఁ డువ్విళులూరు చుండెను. సాధుపురుషుఁడగు జనకుండు, మనసుమాఱి, నూతనోద్యమములం దభిరుచిగలిగి, లోకోపకారి యను కీర్తి నెపుడు గడించునా యని తనయుఁడు తలపడుచుండెను. ఏకత్వమున ననేకత్వము, అనేకత్వమున నేకత్వమును, ఎట్లులోకమునఁ బొడఁగొని, ప్రపంచనాటకము యొక్క శోభకును, కథాపరిస్ఫూర్తికిని సహాయకారులగుచున్నవి!

## ౨

విద్యాపరిపూర్తియైనతోడనే తండ్రిప్రోత్సాహము ననుసరించి నిరంజనుఁడు దొరతనమువారి కొలువున నుద్యోగమునకై ప్రయత్నము చేసెను. కాని, ప్రస్తుతదేశకాలపరిస్థితులు పరిశీలించిన కొలఁదని, ఆత్మగౌరవ మపేక్షించువా నట్టియుద్యోగము స్వీకరింపక, దేశస్వాతంత్ర్యము నొడఁగూర్చు కృషియందె జీవితము గడపవలయునని యతఁడు దృఢనిశ్చయుఁ డయ్యెను. కావున తన కుద్యోగమయినదనువార్త దెలిసిన నాఁడె, అదిత్యజించి, నిరంజనశాస్త్రి, సహాయ నిరాకరణోద్యమమునఁ బ్రవేశించెను. ఆనాఁడు వారిగృహము ప్రబల సంక్షోభమున కాటపట్టయ్యెను. పెంచి ప్రయోజకునిఁ జేసిన తండ్రి కోరికను జెల్లించి, ఉద్యోగ స్వీకారముచేయుట పుత్రునిధర్మమని పితరుని వాదము. ప్రస్తుతదేశకాల వైపరీత్యమును బట్టి, తలిదండ్రుల మాట వినుటయెకాక, దేశమాతఋణము తీర్చుటయు, పుత్రునికిఁ గర్తవ్యమని సుతుని ప్రతివాదము. తాము నమ్మిన ధర్మవిధులకు ప్రతికక్షు లిరువురును సమానముగఁ గట్టుపడువారగుటచేత, ఇందు ధర్మనిర్ణయము చేయుట మఱెవరికిని సాధ్యము గాకుండెను. వెలుపలకు వ్యాపింపలేని యగ్ని లోలోనసె రగులు చుండునట్లు, పితాసుతుల కలతలు మేర మీఱుటకు వీలుపడక, అంతరంగముననే కుములుచుండెను. తండ్రి కొమరు లొకయింటనే యుండినను, నాఁటినుండియు నొకరితో నొకరు మాటాడ మానుకొనిరి. ఒకరిలోటుపాటు లొకరు దిద్దఁ గలిగియు నుపేక్షించిరి. ఆర్థిక రాజకీయా వర్థముల కన్నిటితో దేశము

లోనగువవుడు, వీనికన్నిటికిఁ గుంకటివేరగు విదేశప్రభుత్వమునకు దాస్యము సల్పుటవలన నాత్మగౌరవము పోవునని యెఱుఁగని జనకునిఁజూచి తనయుఁడు వగచుచుండెను. జలబుద్బుదములవంటి పృథివీ సంపదలకు, నుద్యమముల కొఱకును, సుతుడు చిత్తశాంతిని వీడి, స్థిరసౌఖ్యము గోల్పోవుటకు తండ్రి చింతిల్లెను. కావున నాతండ్రి కొమరులు, లోకులకు మంచి యాలోచనలు చెప్పఁగలవారలైనను, తమసునిశితబుద్ధివలని లాభము తామె పొందఁజాలక, ప్రవాహవేగమునఁ గొట్టుకొనిపోవు కట్టెయలవలె నెవరిదారిని వారు ప్రవర్తించుచుండిరి!

## ౩

కాలచక్రము దిర్దిగఁ దిరుగుచుండును. నిన్నటిసంగతులు నేఁడు ప్రాతపురాణములు! రేపటివి విశ్వసింపరాని వింతకథలు! ఈహాస్యపరిహాసములకుఁ దావలమగు ప్రాతక్రొత్తల మధ్యనే మన జీవితములు కడతేఱుచున్నవి. బుద్ధిమంతుఁడని పత్రికలకెక్కిన నిరంజనశాస్త్రిమీఁద జనకల్లోల కారకుఁడని యభియోగము వచ్చినపుడు, ప్రభుత్వమువారు పసిబాలుర యుసురుపోసికొను చున్నారని ప్రజలు మొఱపెట్టిరి. కాపరిలేని గొఱ్ఱెయలను హైందవులకు నాంగ్లేయులు రక్షకులైరని వెనుక విద్యార్థి దశయందు వ్యాసరచనమొనర్చి, ఆ ప్రభుభక్తికి గురువుల మన్నన లందిన నిరంజనుఁడు, ఆంగ్లేయ పరిపాలనా ప్రభావమున భారతీయులు కాపరిలేని గొఱ్ఱెయలుగఁ బరిణమించిరని యుపన్యాసము లిచ్చెనని సాక్షులు ఋజువు పఱచఁగా, చంచలస్వభావులగు యువకులు చెరసాలచూచివచ్చిన నేమి సార్థకమని ప్రజలాశ్చర్యపడిరి. సమర్థుఁడగు న్యాయవాదిని నియమించి, పుత్రుని నిర్దోషిత్వము సాధింప జనకుఁ డెంతప్రయత్నించినను, కుమారుఁడందుకు సమ్మతింపక, తనకు విధించిన యపరాధమును తండ్రిని జెల్లింపనీయక, సంతోషమునఁ జెరసాలలోని కట్టైనడచిపోయెను! సుకుమారుఁ డితరుల దుస్సహవాసుల మంతనములకుఁ జెవియొగ్గి, చిక్కులు తెచ్చుకొనుచుండెనని వ్యసనపడుచుండెడి పరంధామశాస్త్రి, కొమరుఁడు కారాగృహమున కేగుటవలన దుఃఖపరవశుఁడయ్యెను. కొంతకాలమునుండి మాటలు లేకపోయినను, ఇరువురు నొకచోటనే యుండుటవలన వారు ధైర్యము వహించియుండిరి. ఇపుడు వేర్వేరు ప్రదేశములందుండి, వారొకరి సేమమును గుఱించి యొకరు పరితపించిరి. జనకుఁడు కోటవంటి గృహమున భద్రముగనుండినను, రాజసైన్యములన్నియును ఆయనమీఁద కత్తిగట్టివచ్చినట్టుగ కుమారుఁడు భ్రమించి పలవించుచుండెను! సుకుమారముగఁ బెరిగిన సుతునికిఁ గారాగృహవాస మెంతకఠినముగ నున్నదోయని పితరుఁడు వెతనందెను. భిన్నాభిప్రాయులై సంతమాత్రమున నొకరితో నొకని కీవల మాటలు లేక, ఆజన్మవిరోధులవలె మెలఁగుట వారు తలపోసిన కొలఁదిని, వారికి వ్యసనమధికమయ్యెను. వార్ధకమున జనకుని కష్టముల పాలుచేసితినని తనయుఁడును, అర్భకు నాగర్భశత్రువునివలె కారాగృహము చొచ్చుచుండ నూరక చూచుచుండవలసి వచ్చెనని తండ్రియును, దుఃఖార్తి జెంది, ముందు తమలో భిన్నభావముల జాడ మాయకుండునని ముమ్మాటికిని వారు నిశ్చయించుకొనిరి.

## ౪

నిరంజనశాస్త్రి చెరసాలకుఁబోయిన యాఱునెలలకుఁ దండ్రి యాతనిఁజూచుటకు నేగెను. ఈయాఱునెలలు నాఱుయుగముల వలె పరంధామశాస్త్రికిఁదోఁచెను. ఆయన, అహర్నిశములు, కారాగృహమున గాసిచెందెడి కొమరుని కోమలాకారము మనోదృష్టిని వీక్షించుచు, వానినెపుడు ప్రత్యక్షముగఁ గనుఁగొనఁగలనా యని తహతహపడుచుండెను. అధికారులసమ్మతి నడసి, పరంధామశాస్త్రి యొకనాఁడు చెరసాలయందలి కొమరునిఁ జూడబోయెను. కారాగృహమందలి కఠిన నియమములకుఁ గలంగుచు, అస్పుటఁ బెట్టెడి మోటు గంజిమెతుకులు కుడువనేరక, సుకుమార శరీరుఁడగు కుమారుఁడు దినము కయేలుగఁ గడపుచుండునని దుఃఖిల్లు తండ్రిపాదములముందు, రక్షకభటులచేఁ గొనిరాఁబడిన నిరంజనుఁడు సాగిలపడినపుడు, అతనికన్నులు విభ్రాంతినొందెను. కన్నీటి జడివలనఁ గలిగిన దృష్టిమాంద్య మడఁగిన తోడనే, తండ్రీ కొమరులు కుశలప్రశ్నములకు దిగిరి. జనకుని యాగ్రహమునకుఁ బాల్పడిన తాను గారాగృహవాస నెపమున తిరిగి యాయన యనుగ్రహము వడసితినిగదా యని నిరంజనుఁడు మోదమున మిన్నందెను. ఇంక తండ్రికి నిరంజనునిఁ జూచినపుడు జనించిన యానందమును, అతనిముఖమునఁ గలిగినమార్పులు పరికించినపుడు పొడమిన యాశ్చర్యమును, మేర మీఱియుండెను. ఇరువదిరెండేండ్లు దాటియు దాటని నిరంజనుని మోమునం దీయాఱు నెలలలోను, అరువది వత్సరములైనఁ గొనిరాఁజాలని జ్ఞానవైరాగ్యముల జాడలు గానఁబడెను. దీప్తిమంతమగు ముఖపంకజముతో నొప్పెడి యాయువకుఁడు, కారాగృహాశ్రమమునఁ దపస్సు నెరపుచుండెడి మునిపుత్రకునివలె నుండెను. అతని లేమొగమున వయసునకు మించిన వింతలగు శాంతి గాంభీర్యములు సొబగొందుచుండెను. తండ్రి తన క్షేమసమాచారములు వినుపింపుమని కోరినపుడు తనయుఁడు తనబాధలు కష్టములు బయటపెట్టుటకు మాఱుగ, అందలి నియమిత జీవితమునఁ దనకులభించిన యమూల్యలాభములు, క్రూరాత్ములనఁబడెడి యందలి యధికారుల సౌజన్యము, దురాత్ములని పేరుపడిన యపరాధుల మనముల మెల్లగఁ గలిగెడి మార్పులు, ఇవియే వర్ణించెను. ఇట్టి శ్రేయోదాయకమగు స్థితి తనకును లభించిన మేలుగదా యని తండ్రి యనుకొనుచుండఁగనే, కాలాతీతమగుటచేత, నిరంజనుఁడు లోనికిఁ గొనిపోఁబడెను. చెఱసాలకవాటము మూసివేయబడెను.

చెరసాల వాకిట బాల్యస్నేహితుఁడగు వంగలి యుద్యోగి నొకనిని పరంధామశాస్త్రి కలసికొని, కారాగృహవాసమును గుఱించి తనకుఁ గొంతచెప్పుమనఁగా నతఁడిట్లు ప్రసంగించెను.—

"మిత్రమా! ఏమని చెప్పఁగలను? కారాగృహవాసుల యిక్కట్టులు తొలఁగింప దొరతనము వారెన్ని సదుపాయములు చేయుచున్నను, చెరసాల చెరసాలయే! ఇందు కాలిడు నప్పటి నుండియు, సజ్జనులైనను స్వార్థపరులగుదురు! ఇచటి మొరకు వాడు కుడిచి విడిచి నాలుక బవడు గట్టిన సుకుమారులు పాలు పెరుగుల కొఱకు బెంగ పెట్టుకొనుచుందురు. ఆరోగ్యము చెడుచున్న తమకు నేయి మజ్జిగలు, ఫలాహారములు నిప్పించుఁడని వైద్యుని వేఁడుచుందురు. చిన్న పిల్లలవలె జిహ్వాచాపల్యమునఁ జిఱుదిండికై చిందులు త్రొక్కుదురు. రాజకీయ కల్లోలములలోఁ బాల్గొని ఖైదీలైన విద్యార్థుల లిటీవల ప్రవేశించి నప్పటినుండియు కారాగృహమున మంచి మార్పు గలుగుచున్నది. అన్ని విధముల విద్యార్థుల లధికులె. వారి నడత, వారి మాటలు, వారి నైపుణి, కడమ యపరాధుల కాదర్శ ప్రాయముగ నుండు ననుటకు సందియము లేదు. ఐనను, కొన్ని సమయము లందు, విద్యార్థుల లనఁగనే భటుల, భారమధిక మగుచున్నది. 'తాఁ జెడినకోఁతి వనమెల్ల చెఱచును' ఉన్నట్టుండి, సామాన్యఖైదీలకును, భటులకును, దొరతనము వారి నెదిరింపుఁడని విద్యార్థులు బోధింప కుండునట్లు, ఉద్యోగులు పరీక్షించుచుండ వలఁగును. ఈయనుమానములకు నిదర్శనముగ నొకప్పుడు విద్యార్థులు సర్కారు పద్ధతుల నుల్లంఘించుచున్నారు. సామాన్య ఖైదీలను తమతో బాటు సమ్మెలలో దింప యత్నించుచున్నారు. ప్రభుత్వ పద్ధతులను బయట ప్రతిఘటించు మహాత్ములు, చెరసాలలో హానిని శిరసావహింతురా? కావున విద్యార్థుఁడగు ఖైదీయనఁగనే, అమ్మోమ్మి కుంపటికదా యని కారాగృహాధికారులు భయమందుచున్నారు.

మీపుత్రుఁడగు నిరంజనశాస్త్రి మాత్రము యోగ్యుఁడు. ఖైదీలతోఁగాని, భటులతోఁగాని, తగవులకుఁబోక, చుట్టుపట్టుల కల్లోలములు జరుగకుండఁ గనిపెట్టుచుండును. తనసాధు వర్తనముచే నందఱికి నిష్టుఁడై, అందరిచేతను ఋషికుమారుఁడని గౌరవింపఁ బడుచున్నాఁడు!"

కుమారుని వృత్తాంతమువిని మురిసిమంది, ఇట్టివాఁడు పాదమిడిన ప్రదేశము పవిత్రముకాగలదని నమ్మి, పరంధామశాస్త్రి స్వగృహము ప్రవేశించెను.

౨

పాఠశాలలో నిరంజనశాస్త్రి, గోవిందశర్మయును సహాధ్యాయులు. జ్ఞానవయోరూపములందు సమానులుగనుండి, తక్కిన విద్యార్థులకన్న మిన్నలై, వీరు గురువులచే "జయ విజయులను" బిరుదు నందిరి. ఐన నిరువురిలోను తారతమ్యము లేకపోలేదు. అంతరాత్మ ప్రబోధనల ననుసరించి నిరంజనుఁడు పనులు నెరవేర్చుకొను చుండువాఁడు. గోవిందుఁడన్ననో, సహపాఠిని మించవలెననియును, అతని దెసకుఁ బోవుకీర్తి వాహిని కడ్డుగట్టవెట్టి, దానిని తనవైపునకు మరలించు కొనవలెననియును, పరిశ్రమచేయువాఁడు. 'పూవుపుట్టఁగనే పరిమళించును.' చిన్ననాఁడే వీరిద్దఱి గుణములను గ్రహించిన ప్రధానోపాధ్యాయుఁడు, ఒకటి రెండుమారులు గోవిందునుద్దేశించి, "ఓరీ! తలక్రిందైనను, గుణసంపత్తిగల నిరంజనుని నీవు మించనేరవు సుమీ!" యని చెప్పెను. దీనియర్థమును సరిగా గ్రహించి కర్తవ్యమును గమనించుటకు మాఱుగ, గోవిందుఁ డెంతసేపును, సహాధ్యాయుని చదువున మించునుపాయమె యూగయుచుండెను. తుదకు పట్టపరీక్షలో నిద్దఱును కృతార్థత నొందిరి, కాని, నిరంజనుఁడు ప్రథముఁడుగను తాను ద్వితీయుఁడుగను జయమందుటకు గోవిందుఁడు సహింపక, తమ కిద్దఱికి నీస్యాత్యాసమును గల్పించినందుకై పరీక్షకుఁడు మొదలు బ్రహ్మ వరకు నందఱిని శపియించెను! సహాధ్యాయుని మించని తనవిజయము కేవల మపజయమనియె తపన నుండెను!

విద్యార్థి దశవీడినను, చిన్నతనపుఁ గోరికలు గోవిందుని వీడవయ్యెను! పాఠశాల వదలినపిమ్మటను గూడ గోవిందుఁడు తనపూర్వ సహపాఠి యడుగులజాడ గనిపెట్టుచునే యుండెను. నిరంజనుని యుద్యోగప్రాప్తి వానికిఁ గొంత మనస్తాపము గలిగించెను. సహాధ్యాయుఁడు సహాయ నిరాకరణోద్యమమునఁ జేరెనని విని, గోవిందుఁడు కొంత సేదఁదేఱినను, సంపూర్ణముగ తృప్తి నొందఁడయ్యెను. అంతే, గోవిందుఁడును నిరాకరణోద్యమమునఁ బ్రవేశించెననువార్త వినిన స్నేహబృందము, వాఁడు రాజకీయ రంగమున ధర్మ నిర్వహణమునకై వచ్చెనని నమ్మక, ప్రాఁతమిత్రుని మడమలు త్రొక్క పని పూనెనని తలంచిరి! ఈర్ష్యామత్సరములతో నిట్లు గోవిందుఁడు పరోపకారకార్యములకు దిగి లోకుల నాశ్చర్యమున ముంచివైచెను. ఎట్టి విచిత్ర వికారపు నాటకములకీ భూలోకము రంగస్థలమగుచుండును! ఒక ముహూర్తమునను గోవింద నిరంజనులు జనుల కరతాళ ధ్వనులతో కారాగృహము ప్రవేశించిరి. ఒక ముహూర్తమునందే గూడ లూరు చెరసాల నుండి వెడలి, మెడలోని పూలదండలతో స్వగ్రామము ప్రవేశించిరి. శ్రీకృష్ణజన్మస్థాన నివాసమున స్వార్థత్యాగ ప్రవర్తన మొనరించిన వీరులలో నొకని నెరసుల నెన్వరికాలమునఁ బట్టనేర్తురు!

గోవింద నిరంజనులు సహచరులుగా నుండుటచేత "దేశోద్ధారకద్వయ" మని పరిగణింపఁ బడుచుండిరి. సంతత మందహాస సుందర వదనారవిందమున నొప్పెడి గోవిందుఁడు ధీరతముఁడని పలువురిమతము. ప్రశాంతమూర్తియగు నిరంజనుఁడె యధిక ప్రజ్ఞావంతుఁడని కొందఱు తలంచిరి. స్వాగతసభలలోను, వినతిపత్రస్వీకారసమయములందును, ఉభయులపక్షమున నుపన్యాసమీయ గోవిందుఁడే యుపక్రమించుచుండును. తను కొంచెపుపని కింతరచ్చ యేలయని విసిగినట్టుగ నిరంజనుఁడు మితభాషియై మెలఁగుచుండును. ఇట్లే నాఁటికి, గురువువాక్యము వమ్మై, తనపేరు ముందై, మిత్రునిమించఁ గలిగితినని, దిగ్విజయము చేసినట్టుగ గోవిందుఁడు కులుకుచుండును!

ముఖముచూచి మోసపోవు మనుజులకు, మనసునందలి మర్మమెట్లు బయలుపడఁగలదు? కావున గోవిందనిరంజనులు సమానప్రతిభులనియును, కాకున్న, ప్రథముఁడగు గోవిందుఁడే ప్రథముఁడనియును, జనులు విశ్వసించిరి!

## ౬

నిరంజనశాస్త్రి చెరసాలవదలి యింటఁ బ్రవేశించుసరికి, దేశమందలి పరిస్థితులు కొంత మాఱిపోయెను. ఇంతకుఁబూర్వము గాంధి మహాత్ముఁడు ఆంధ్రదేశమునఁ బ్రచారము సలిపి, సహాయనిరాకరణమును గుఱించి ప్రజలలో ప్రబోధము గలిగించి, స్వరాజ్యోద్యమ వ్యాపనమునకై కానుకలుగఁ గైకొనిన ధనరాసులు దేశసేవాకార్యముల కొఱకు సమర్పించి, కారాగృహమునకుఁ బోవునప్పటికి, ఈ నూతనోద్యమమును గుఱించి జనుల యుత్సాహము తగ్గిపోయెను. అధైర్యపడవలదని మహాత్ముని యనుచరులు జనుల నెంతె ప్రోత్సహించినను, సేనాని లేని సైనికులైన వారలయెడల ప్రజలకు విశ్వాసము క్షీణించెను. కావున, యే నాయకుఁడు వచ్చువఱకును రాజకీయాందోళనము సలుపుట నిరర్థకమని గ్రహించి, ఆ మహామహుని యభిమానము వడసిన యితరోద్యమములను గుఱించి యనుపనాయకులు కృషిచేయసాగిరి. కొందఱు మద్యపాన నిషేధమును గుఱించి పనిచేసిరి. ఖద్దరు వస్త్రనిర్మాణమును గుఱించి పలువురు పాటుపడిరి. మఱికొందఱు నిమ్నజాత్యుద్ధరణము మహాత్మునికిఁ బ్రియతమమైన సంస్కరణయని దానిని సాధింపఁబూనిరి. ఈ కడపటి కృషియందు నియుక్తులగు వారలలో నిరంజనశాస్త్రి యొకఁడు.

పంచమజాత్యుద్ధరణము దేశాభ్యున్నతికి ముఖ్యసాధనమనియును, ఈ సేవయందు నియుక్తులగువారు, ఓరిమి, దయ, స్వార్థత్యాగము మొదలగు సుగుణముల నలవఱచుకొని, సన్నియమముల నూని, ఆత్మపరిపాక మందఁగలగనియు, నిరంజనుఁడు నమ్మి, యీ యుద్యమమునఁ బ్రవేశించెను. కారాగృహవాస మప్పటినుండియు నతనికి గోవిందుఁడు ఒసి భుజమయ్యెను. అతఁ డెంత మంచివాఁడు కాఁడేమోయని భయమందిన నిరంజనుని మనస్సున, మిత్రుల పెదవి విఱుపులు మొదట మరింత సంశయములను బెంచెను. మాటలు చెప్పవచ్చును కాని క్రియ లగపఱచుట కష్టము. గోవిందునికి సచ్చింత సద్భావములె లేకుండినచో, అతఁడూరక చెరసాలలోఁ గష్టపడక తనవిద్యాప్రజ్ఞల కనుగుణ్యమగు నేవృత్తినైనఁ జేకొని, ధనసంపాద్యమునకుఁ బోయెంగదా యని నిరంజనుఁడు తన్నుఁదాఁ బ్రశ్నించుకొని, గోవిందుని హృదయ క్షేత్రమందు దేశభక్తి బీజములు మొలకెత్తుట సత్యమని సిద్ధాంతము చేసికొనెను.

ఇట గోవిందుఁడు ఒడి దుడుకులులేని ఖాదీవ్యాపనమును బూని, దేశసేవాతత్పరుఁడని పేరునంది, తాఁగొంతసేదఁ దేఱి, మెల్లగ ప్రఖ్యాపురుషార్థములఁ జేపట్టఁ దలంచెను. జాతీయ వికాసతకుఁ బట్టుకొమ్మయగు ఖాదీవ్యాపనమందు మిత్రులగు తామిరువురును జేరి కృషి చేయుదమని గోవిందుఁడు నిరంజను నాహ్వానించెను. నిరంజనుఁడందుకు సమ్మతింపక, పంచమోద్యమము ముఖ్యమని త్రికరణశుద్ధిగ నమ్ముట చేతఁ దానాకార్యమునే జరపుచుందు ననియును, మిత్రుఁడు మాత్రము శ్లాఘనీయమగు ఖద్దరు వ్యాపనమున పనిచేయ వచ్చునని యును జెప్పివేసెను. కాని, యేకార్యము నందైనను స్నేహితుని వీడి యుండుట గోవిందుని పద్ధతి కాదు. కొన్ని మొలకలు స్వతంత్రజీవనమునకుఁ జాలియుండక, ఇతరజాతి వృక్షముల నాశ్రయముగఁ జేకొని, వాని సొగముగ్రోలి వర్ధిలుచు, తుదకు వానిని తుద ముట్టించును. వ్యక్తి విశేషమును బట్టి గోవిందుఁ డిట్టి బసనికయొ! తానేదేని స్వతంత్ర కార్యము చేఁబట్టి, అందు శక్తి యుక్తులఁ జూపి, పేరు ప్రతిష్ఠలు గాంచవలెనని యాతని యాశయము కాదు. ప్రఖ్యాతసమాజసేవకుని లోకపావనకాలమందును సహపాఠిగఁ జేకొని, అతని నెమ్మనమందే దిద్ది, యాతని మించిన విద్వాంసుఁ డనిపించుకొనవలెనని గోవిందుని సంకల్పము! సహవాసుఁడు తన వెన్నుఁడు, సందును, మించఁ గూడదనియు, తన చేయివిడఁగ, పేరు ముందు నడువవలెననియును, గోవిందుని కోరిక! ఉద్యమముల యొక్కయు, ఉద్దేశముల యొక్కయు, యోగ్యతా యోగ్యతలతో గోవిందునికిఁ బ్రసక్తిలేదు. మిత్రుని మించునట్టుగఁ బ్రజల హృదయస్థల సంచుట యే వాని ముఖ్యాశయము. కావుననె యతఁడు తన ఖాదీప్రచార మిపుడు గంగను కలిపి, పంచమజాత్యుద్ధరణమునకు దిగెతినను సెపమున మిత్రునితో మరల బుజముగలిపెను. కుడు



నిరంజనుఁడు నమ్మి యీ యుద్యమమునఁ బ్రవేశించెను.

ము చేతికిచ్చిన పండుగ యనుకొను నిరంజనుఁడు, తన పూర్వసహపాఠి, స్వార్థత్యాగము నందును స్నేహ సఖ్యతల యందును, అసమానుఁడగు ప్రోడయని నమ్మి, అట్టి మహనీయుని సహవాసము మహాప్రసాద మని యెంచి, అతనితోఁ గార్యసాధనమునకు దొరఁకొనెను.

## ౨

నిరంజనశాస్త్రి స్థాపించిన "పంచమాశ్రమము" దినదినాభివృద్ధి గాంచుచుండెను. ప్రతి బుధవారము నతఁడు పంచమ జనుల యుపయోగార్థము చేసెడి ప్రసంగ సంఘ "మణములు పంచమజనులలో ప్రబల సంచలనము గావించెను. అవర్ణములవారిపుడు దేహగేహ పారిశుద్ధ్యముల విషయమై యమితశ్రద్ధ వహించి, తమ బాలబాలికల విద్యాభివృద్ధిపట్ల జాగరూకత వహించి, తమ జాతి యుద్ధరణమునకై యింత చేయుచున్న బ్రాహ్మణ యువకుని యెడల మిగుల ప్రేమ కృతజ్ఞతలు గలిగియుండిరి. చీఁకటి రాత్రిని ఎడారిలోని జ్యోతి చిన్నపురుగులను నాహ్వానించును. నిరంజనుని సత్కార్య ఫలములు తమకనల నాకర్షింపఁగ, పలువురు విద్యార్థులిపుడు వానికి సాహాయము చేయఁ బరువులెత్తివచ్చిరి. ఇట్లు నిరంజనుఁడు జయప్రదముగ నడుపు పంచమోద్యమము, వేర్వేరు స్వభావములు గల యువకులకు దేశోపకారుల కాట పట్టయ్యెను!

కారాగృహవిముక్తుఁడై గృహము సొచ్చిన పుత్రుని పరంధామశాస్త్రి కంటిని రెప్పవలెఁ గాపాడఁజూచెను. అతనికిఁ దనకును ఆచారాదులను గురించి యభిప్రాయభేదములున్నను, సుతుని సత్కార్యవిముఖునిగఁ జేయఁబూనక, వాఁడు తప్పుదారులు త్రొక్కకుండఁ గని పెట్టుట మాత్రము తనపనిగఁ జేసికొనెను. నిరంజనునితోఁ గార్యసాధనమునకుఁ దొడఁగిన సజ్జనులలో కొందఱు దుష్టులు గలిసియుండుటను పరంధామశాస్త్రి మిగుల వగచెను. "దేవుని పెండ్లికందఱు పెద్దలే"! పరోపకారకార్యములఁ బ్రవేశించువారు, వేర్వేరువర్తనల వెలఁగువారయ్యెను, సమానగౌరవ మపేక్షింతురు. సజ్జనులు సత్కార్యములు సాగించుట సహజమె. కాని, దుర్జనులు మంచికార్యము లేల దొరఁకొందురో మాత్రము తెలియకున్నది! సత్పురుషుల పెద్దలోపము, జగతియంతయును సత్పురుషమయమని మనుకొనుటయె. తమతోఁ గలిసి యీ పరోపకారకార్యమునందు సహకారులుగ నున్నవారందఱును మహామహులని కొనుట నిరంజనుని పెద్దలోపము. నిరంజనునితో నొకయేడు చెరసాలలోఁ గడిపిన మాత్రమున, గోవిందుఁడు వానికి మిత్రుఁడు, పరమపవిత్రుఁడు నయ్యెను! ప్రస్తుత పంచమోద్యమ ప్రవర్తకు లందఱును పావనమూర్తులనియె నిరంజనుని తలంపు! తనయుని కనులు విప్పుటకు తండ్రి యెన్నిప్రయత్నములో చేసెను. కాని, జనకుని తోడి వాదమున ప్రస్ఫుటమగు సుతుని సునిశిత బుద్ధివికాసత, పరిస్థితుల సత్యాసత్యముల రయుట కుపయోగింపకుండుట మిగుల విషాదకరము. కన్నతండ్రి తన హితము నెంచియె నూతనమిత్రులగుట్టు బయలు పెట్టుచుండెనని తనయుఁడెఱిఁగియు, ముసలివారలబుద్ధి, క్రొత్తపద్ధతులను, మనుజాలలోని క్రొత్తమార్పులను బాగుగ గుర్తింపఁ జాలదని యోజించి, తండ్రిమాటలు పాటింపకుండును. జనకుని హితబోధనము, సత్యమునకుఁ జాలదూరము గదా యని తనయుఁడు తలపోయుచుండును. పరంధామశాస్త్రి మిగుల దైన్యపడినపుడు మాత్రము, "సరే! నేను గనులు తెఱచియె సంచరింతును లే! నా యనుచరులు దయ్యములు భూతములునుగారు! ఐనను శోధించియె వారిని స్నేహింతును లే!" అని నిరంజనుఁడు తండ్రితోఁ బలికి, తన పనుల దెసకు గంతిడుచుండును.

## ౩

"ఇంటిదొంగను ఈశ్వరుఁడైన పట్టలేడు!" అనుచరులందఱును తనవలెనే దైవముఖము నొంది పనులు నెరవేర్చెదరని నిరంజనుని తలంపు. సత్యము మాత్రమది కాదు. పంచములు, పంచమవిద్యార్థులును నిరంజనుని జనకునిగ భావించి పూజించుచుండుటచేత, పలువురికి వానియెడల మాత్సర్యము పొడమెను. సాగిలేటి క వలిగొట్టుచున్న కాఁపువారలకు, పంచముల విద్యాభివృద్ధి కొంత యసూయఁ గలిగించెను. పంచమసేవకుఁడు విద్యగఱచినచో, మాటలు నేర్చిన పేటుకుక్కవలె, వినయవిధేయతలు వీడి, పొలము పనులలో పాలుపోలునని కాఁపువారల భయము! విద్యవలని ప్రయోజనలాభము వినయాధికతయని నిరంజనుఁడెంత చెప్పినను, కాఁపుల మనస్సుల కలఁక దీఱకుండెను. ఇది యిట్టులుండఁగ, పంచమోద్యమమునకై పాటుపడు యువకులలోఁ గొందఱికి, మిగులకష్టపడి తాము పనులు చేయుచుండఁగా, పేరుప్రతిష్ఠలు నిరంజనుఁ డందుకొనుచుండెనని యీర్ష్య గలిగెను. వీరి సందియముల బలపఱచుటకు వారిలోనే కొందఱు బద్ధకంకణులైరి. అట్టివారిలో ముఖ్యులు గోవిందశర్మ, గోపాలసింగును.

గోవిందశర్మ పాపముల కాలవాలమగు పరిణతుఁడు. తన పేరు ముందునకు తేఁదగు దేనికార్యమునకైన దిగునుగాని, తక్కిన యుద్దేశములతోఁ గాదు. జనసంస్థను జరపు విషయమున, నిరంజనుని ముందిడుకొని, తానును స్నేహితులును దివిటీక్రింది దీపములై తిమని యతఁడు ఊడుకుచుండెను. ఎట్లు తాను నిరంజనుని స్థానమాక్రమింతునాయని యతఁడు సదా యోజింపసాగెను. లోకములో నొకఁడు చెడిననేగాని, వేఱొకఁడు బాగుపడఁడు. ధనికుఁడు పేదయైనఁగాని, పేదధనికుఁడు గానేరఁడు. యశస్సున నోలలాడు వాఁడంతరించినఁగాని కాచియుండు వారలకుఁ గీర్తికాంత ప్రసన్న కానేరదు. కాన నేయుపాయమునకైన తనకోరిక నెరవేర్చుకొనవలెనని గోవిందుఁడు చూచుచుండెను.

ఇఁక గోపాలసింగును గురించి యొకింత చెప్పవలయును. బ్రాహ్మణేతరోద్యమమునఁ బనిచేసి హాయిగ నోడి నింపుకొనుచుండువానిని, స్వరాజ్యోద్యమ సంస్థను జేరి విశాలదృష్టి గాంచుఁడని మిత్రులు కొందఱు తొందరపఱచి యిటకుఁ ద్రోసినను, సహాయనిరాకరణమను సుడిగాలిచేఁ గొట్టుకొని వచ్చినప్పటి నుండియును, వానిదృష్టి మరింత

ప్రాప్య మగుచుండెను! ఎన్నిమాఱులు నులిపినను, సింగుకనులు వెండి బంగరులకంటె వేరు దృశ్యములు గానరాకుండెను. గాంధిమహాత్ముఁడు, ఈప్రాంతములకు వచ్చిన తరుణమున, ప్రజలు వేనవేలుగ వచ్చి, ధనరాసులు సమర్పించిరి. నగలు నాణెములు కుప్పలుగఁ గురిసెను. ఈసొమ్మంతయు దేశసేవాకార్యములకు వినియోగింపుఁడని సింగునకు స్నేహితులకును మహాత్ముఁ డిచ్చివేసెను. కాని దానిలోఁ జాలభాగము సింగు సొంత వ్యయములకు వాడుకొని, వలసినపుడు తీర్చివేయుదునని చెప్పుటయే కాని, నేఁటికి నట్లు చేయనేలేదు. స్వదేశోద్యమమునఁ బాల్గొను బ్రాహ్మణేతర నాయకుని నేరము బయలు పెట్టినచో, జాతిపై నమ్మకములు మఱింత యుద్రేకించునని మిత్రులూరకయుండిరి. కాని, యెల్లకాలము సహాయనిరాకరణోద్యమమున నిట్టి లాభములు ప్రాప్తించునా? కావున, సింగిపుడు చిగుడండిలేక చిక్కిపోవుచున్నాఁడు! గోరుచుట్టుమీఁద రోకలిపోటును నట్లు, ఇపుడు సింగును పంచమోద్యమములోని కమాంతిముగ దింపిరి. నాఁటినుండియు నాతనికన్నులు విప్పనేలేదు! పోనిండు, బ్రాహ్మణేతర నాయకుఁడని కీర్తి కబళమైన నింత సింగును కారు నిటుచేయుచుండిరి! కావున తన దురవస్థకుఁ గారణమగు నిరంజనశాస్త్రి తోశము పట్టినఁగాని, తనపాలు తనకు దక్కదని విశ్వసించి, గోపాలసింగుకూడ నిరంజనునిమీఁద ధ్వజమెత్తెను.

కంచె చేను మేసినట్లు, పంచమోద్యమమునఁ బాటుపడవలసిన గోపాలగోవిందులు, దానివినాశమునకే పనిచేయఁదొడంగిరి. పంచములలో ప్రబోధముగలిగించుటకు మాఱుగా, తమ గురువుల మీఁదను, స్వాములగు భూస్వాములమీఁదను ధ్వజమెత్తుఁడని చాటుచాటున వారల కుపదేశించిరి. చాలపాములకోప మతివేగముగఁ బెరుఁగును. విద్యాబోధముగావించుమిషతో, నిరంజనశాస్త్రి పంచమజాతి దాస్యమును మఱింతదృఢపఱచి, వారి సర్వస్వమును బ్రాహ్మణులకుఁ గాఁపులకును గట్టిపెట్టుచున్నాఁడనియును, ఖామందులనుకాఁపులను వారిమీఁదికుసికొలుపుచున్నాఁడనియును, ఈనుష్టద్వయము పంచములకుఁ గొండెములు చెప్పిరి. తమ గురువులగు వీరినోటనే యీమాటలు వినవచ్చుటచేత, అమాయికులగు పంచములు కొంత యీవి నమ్మి, తమ్ము నిరంజనుని పగనుండి తప్పింపుఁడని వారినె కోరిరి.

ఈప్రముఖు లిరువురును తీరికచేసికొని కాఁపుల గ్రామమేగి, పరమమిత్రులవలెనటించి, నిరంజనుఁడు పంచములను వీరిమీఁదికెత్తివచ్చునట్లు సిద్ధముచేయుచున్నాఁడని రహస్యముగ వారి కెఱిఁగించిరి. పంచములలోని మార్పునకిదివఱకే కనలుచున్న కాఁపుల స్పర్ధలు దీనివలన మఱింత రగులఁజొచ్చెను. నిరంజనుని మిత్రులే యీవార్త తెచ్చుటవలన, కాఁపుల కది మఱింతనచ్చి, సుతిమించకమునుపె పంచములపని పట్టవలెనని వారు యోజింపసాగిరి.

ఇట్లు గోపాలగోవిందులు, కాఁపులకు నిరంజన పంచములమీఁదను, పంచములకు కాఁపులపైని, నిరంజనునిమీఁదను విరోధాగ్ని నెలకొల్పి, అది రగిలి మండుసమయమునకు వేచియుండిరి.

## ౬

ఇది యిట్లులుండఁగా, సాగిలేటికావలి యొడ్డుననున్న కాఁపుపాలెపుప్రజలలో నింకొకవిధమగుసంచలనముగూడఁ గలిగెను. నిరంజనశాస్త్రి పలుమాఱు రచటికేతెంచి, పంచములకు వారుచేయవలసిన సముపాయములనుగుఱించి కాఁపులతోఁ బ్రసంగించుచుండెను. ఈసంభాషణములు వినిన కాఁపుయువకులలోఁ గొందఱికి దేశోద్ధరణకార్యములను గుఱించి యుత్సాహముగలిగెను. అట్టివారిలో ముఖ్యుఁడు లక్ష్మణస్వామి.

లక్ష్మణస్వామి, ఉన్నతాంగ్లేయ విద్య నభ్యసింపకున్నను, యోగ్యుఁడు, కుశాగ్రబుద్ధియునగు యువకుఁడు. తమ గ్రామమున జనుల యుపయోగార్థమొక పఠనమందిర మేర్పఱచి, అది బాగుగ జరపుచుండెను. నిరంజనుఁడు నడపుచుండు పంచమాశ్రమమునెడ నతనికమితాభిమానము గలిగెను. పంచముల యభివృద్ధినిగుఱించి వారి యజమానులగు కాఁపులకే బ్రాహ్మణులకంటె నధికముగ పాటుపడవలసిన బాధ్యతగలదని యతఁడు తన వారికిఁబోధించును, నిరంజనశాస్త్రికిఁ దాను తోడుపడుచుండును. లక్ష్మణునికిని, పంచమోద్యమమునుగురించి పనిచేయు నితరయువకులకును గల తాగత్యము త్వరితకాలములోనె తెల్లమయ్యెను. కీర్తికాముత్వమునఁగాక కేవల సోదరధర్మనిర్వహణమునకే నిమ్నజాత్యుద్ధరణమునకుఁ గడంగవలెనని యాతని యభిప్రాయము. పంచముల దయ ఆదరానుగ్రహములుచూపు నధిపులవలె మనము వర్తించునంతవఱకును వారిస్థితి చక్కఁబడదనియును, ఒక తల్లిబిడ్డలవలె వారితోఁ గలసిమెలసి యుండునపుడే వారు ముందుకురాఁగలరనియును, లక్ష్మణుని నిశ్చితాభిప్రాయము. ఇంక నీవిషయమున మాటలతోఁబనిలేదని, కార్యాచరణముననే యాతఁడు కడంగెను. తక్కినప్రచారకుల వలెఁగాక లక్ష్మణుడు తమ గ్రామమునందలి స్వంతభవనమును వదలివైచి పంచమాశ్రమమునందె తాను విడిది యేర్పఱచుకొనెను. కూటికి గుడ్డకులేక యాదిమాంధ్రులల్లాడుచుండునపుడు, భాగ్యవంతులు భోగపరాయణులగుట పాపమని నమ్మి, లక్ష్మణుఁ డేకవస్త్రధారియై, కఠినాహారనియమముఁ బూనియుండెను. పంచముల యిండ్లను బాహాటముగఁబోవుచు, వారికష్టసుఖములారయును; వలసిన సాహాయ్యముచేయుచుండును. కన్నతండ్రివలెఁ దమ్ము నిట్లుగనిపెట్టు లక్ష్మణుని యెడల పంచములు కడుఁగూరిమిగలిగి, యాతని చేయూఁతవలన నభివృద్ధిగాంచుచుండిరి.

పంచమోద్యమమునుగుఱించి యిట్లు పాటుపడుచుండుటవలననే లక్ష్మణుఁడు నిరంజనునికాంతరంగిక మిత్రుఁడయ్యెను. సాధుపుంగవుఁడగు లక్ష్మణునివంటి వారుగదా యీయుద్యమమును సాధింపఁగలరని నిరంజనుఁడునమ్మి, ఆదర్శపురుషుఁడగు వానిమీఁదనె యాశ్రమ నిర్వహణభారము ముఖ్యముగ నుంచెను.

కాని, లక్ష్మణుని ప్రముఖత, ఇదివఱకే నిరంజనుని యున్నతిని గంటకించిన గోపాలగోవిందులకు మఱింతదుస్సహమయ్యెను. "ముందు వచ్చుచెవులకంటె, వెనుక మొలచు కొమ్ములు వాడియను"నట్లు, ప్రథమ

మునుండి పరిశ్రమచేయు తమకుఁగాక మొన్న మొన్న చేరిన యీ కాఁపు కుఱ్ఱనికి ప్రతిష్ఠవచ్చుటకు వారు సమ్మతింపక, వానిమీఁదఁ గసితో నుండిరి. నూతన ప్రియుఁని ప్రేమమరగి నిరంజనుఁడు ప్రాఁతయనుచరులకు తమ్మువిడనాడెనని వారువాపోవుచుందురు. "గురుశిష్య"లని చాటు చాటున నిరంజన లక్ష్మణస్వాములను వారు పరిహసించుచుందురు. ఎట్లు వీరిపొత్తు భంగపఱచి, తాము మగల మంగుఁబడెదమా యని వారు సదా యోజించుచుండిరి.

గోపాలగోవిందులు కాఁపుపాలెముపోయి, లక్ష్మణనిరంజనుల గుఱించి యచట నపవాదములు బలయించిరి. లక్ష్మణుఁడు, తాను గొప్పవారియింటఁ బుట్టితి ననుమాట మఱచి, గురుబోధనల ననుసరించి పంచములతోఁ గని తిర్గుచుండెననియు, ఒకటి రెండు దినములలో వారిలో గలసిపోను సుద్యమించియున్నాఁడనియును, వారు ప్రకటించిరి! ఈయిరువురి సాయముచూచుకొని మైలఁబడిన పంచములు, కాఁపుల తోడి కయ్యమునకుఁ గాలు ద్రవ్వుచున్నారనియు వారు చెప్పివేసిరి! ఇదివఱకే పంచములమీఁదను, నిరంజనుని దేసను వైరమూనిన కాఁపుల యాగ్రహమందువలన మఱింత ప్రజ్వరిల్లెను. ఇంకఁ దామూరకుండిన చో, పరిస్థితులు మితిమీఱి, లక్ష్మణుఁడేకాక, తక్కిన యువకు లెల్లరును క్రమక్రమముగ పంచములలోఁ గలసిపోయి, తమ జాతిసంకరముగునని భీతిల్లి, పంచములు తిరుగు పక్కలలోని బల్లెములుగాక మునుపే వారలనుక్కడగింపఁ గాఁపులు గడంగియుండిరి.

కుశలంతల జాడలు కొంత తెలిసి, పరంధామశాస్త్రి కొమరు నొక ప్రాతఃకాలమున నే కలిసికొని, "నాయనా, సమాచారములేమి?" అని సంభాషింపఁదొడంగెను.

నిరం: "సమాచారములకేమిగాని, నాయనా! ఈ తెల్లవాఱు జామున నా కొకవింత కలవచ్చి,యింకను కనులకుఁ గట్టినట్లేయున్నది. మేఘరహితమగు నంబరమునుండి పిడుగుపడి, ముద్దులుగట్టు మనమామిడి గున్న మాడి పోయెనండీ! పసిపిల్లవంటి పంచమోద్యమమున కేమికీడు మూఁడునోయని ప్రాణము తల్లడపడుచున్నదండీ!"

పరం: "తండ్రీ! మబ్బులేనిపిడుగు, మాయావిలేని మోసము నుండునా! అంతయు నూపులోపమేగాని వేరుకాదు. దుర్జనుని దృష్టికి, సంస్థలు, జీవములు నొక్కటియె సుమీ. నాయనా, నీ వీనాఁడు ఇల్లు గదలకుము!"

నిరం: "కలకల్లరో! ఇన్నాళ్లు పెంచిన సంస్థను స్వప్నభీతిచే నిపుడెట్లు విడనాడను? పిడుగైనను చెడుగైనను, విఘ్నములఁ జెండాడుట మన విధికదా! అసలు, జయాపజయములు హరికరుణ యను గ్రహింపవలసినవె!"

పరం: "నీమిత్రులు కొందఱు కపటులై కయ్యములు గలిపించుచున్నారు సుమీ!"

నిరం: "సరే, యిది మామూలు తోస్యమె! ఏ గోపాలగోవిందులో వారి మొనకాండ్రనిమాట కదా?"

పరం: "ఔను నాయనా! వారిని నమ్మియె నీవు చెడిపోవు చున్నావు—"దుష్టునకు దూరమున నుండవలయును." ఇపుడైనను ఈ సంస్థ వారి శిరమునన్ పవహైచి, ఆపదతప్పి, హరిచరణస్మరణతో హాయిగ నుండఁగూడదా?"

అని కన్నతండ్రి కనులనీరు తెచ్చుకొనెను. నిరంజనుఁడు మందహాసమున జనకుని భయముఁ గోనాడఁజూచి, "నాయనా! ప్రొద్దు న నే మనకీ వాదనలేల? తగినంత జాగ్రతతో నుందును. న్యాయధర్మములఁగాచు నారాయణుని నె నమ్మియుందును. ఇఁక నేమిభయము? సరేకదా!" అని సమాధానము చెప్పెను.

"సరిగాకేమి, నాయనా!" అని పరంధామశాస్త్రి గద్గదస్వరముతోఁ బలికి, కపోలతలమునుండి సెలయేటిధారవలె నొలుకు బాష్పజలమును తన యుత్తరీయపు కొసతోఁ నొత్తికొనుచు, మరలి వచ్చెను.

## ౧౦

ఆమధ్యాహ్నము నిరంజనశాస్త్రి పంచములగూడెమే సునపుడు వింత సన్నివేశ మొకటి విలోకించెను. సాగిలేటి కావలియొడ్డున మిట్టప్రదేశమున నొక సైన్యము విడిసి, స్పాటుకవి నవలలలోని వర్ణనమును వాని జ్ఞప్తికిఁ దెచ్చెను. గుడ్డుఁగట్టులు మూపులపెట్టుకొని కోపోద్దీపితులైన సోదరులు కాఁపుల ముఖములు వానికిఁగానవచ్చెను! వీరిని ధైర్యముతో నెదుర్కొనుటకు, తమ కుటీరములయొద్దను పంచములు బారులుదీర్చి, కత్తులు కటారులాయితము చేసికొనుచుండిరి! ఉభయుల కీయాకస్మిక పైగమెట్లు సంభవించెనా యని యాచ్చెరువందుచు నిరంజనుఁడు గూగమున ఆశ్రమ కుటీరమున కేగుగాగ నిచ్చెలితో నుండెడి తనయుపాధ్యాయమిత్రులను గాంచెను. సమీపించిన కొలఁదిని, వానికి వారి మొగములు స్పష్టముగ గోచరించెను. ఏలనో కాని, గోపాలగోవిందులు, వారల యనుచరులు నచటఁగానఁబడకుండిరి. మిత్రులను గలసికొని, నిరంజనుఁడు, ఈగడిబిడికిఁ గారణమేమని విచారింపఁగ, కొందఱి దుర్బోధనలవలన, కాఁపులకు పంచములకుఁ గలతలు పెరిఁగ, కసిదీర్చుకొనుట కుభయులును యుద్ధసన్నద్ధులైరని తేలినది! కలహకారకులు గోపాల గోవిందులని, ఒకరిమొగ మొకరుచూచుకొనుచు, స్నేహితులు నిరంజనునికిఁ జెప్పలేక చెప్పిరి! వారిబోధనలవలననే, నిరంజనుఁడు అతని మిత్రులును తమకు ద్వేషులని యిరుప్రక్కలవారును అపోహపడుచున్నారని తెలిసినపుడు, నిరంజనుఁ డాశ్చర్యమున మునిఁగి, జనకుని హితవచనములు మొదటినుండియుఁ దానేల పెడచెవిని పెట్టితినాయని పరితపించెను. అతఁ డింత వారలతో నాలోచించి, అందఱు నాపదనుండి తప్పించుకొనుటకై, అచట సమావేశమైన యుభయకక్షులవారికిని నిజము తెలిపి, ఒండొరులకు మిత్రభావము గలిగించుటకుఁ దానుబూనుకొనెను. ఇపుడు తమదగ్గఱకువచ్చిన నిరంజనశాస్త్రితో రెండుప్రక్కలవారును

కోరు మొదలుపెట్టకైన మొదట నిష్టపడకున్నను, ఆక్రమమున కెదుటి మిట్టప్రదేశమునకువచ్చి కూర్చుండుట కెట్టకేలకు సమ్మతించిరి. నిరంజనుడపుడు వారితో సంభాషించి, కర్తవ్యమును బోధించి, తనప్రసంగము నిట్లు ముగించెను:—

"కావున మిత్రులారా! భారత జనని తనయుల మగు మన మందఱము సోదరులము. అందఱి శ్రేయమె దేశక్షేమము. ఐదువ్రేళ్లను గూడి యుండు నదియె హస్తము. ఏవ్రేలి తోడ్పాటు లేకున్నను, చేయి సరిగా పనిచేయ నేరదు. హిందూమాతకరమున కైదు వర్ణములు నైదు వ్రేళ్లు. పంచమజాతి వెనుకఁబడి యుండుట వలన, మన సంఘాభివృద్ధికి తీరని కొఱఁత వాటిల్లినది. కాల కర్మదోషమునలన, నాలుగు వర్ణములకును పంచమ జాతికిని పొత్తులేకున్నది. కులవైషమ్యములచేఁ గుంటువడిన హేతువుననే హిందూసంఘము నాగరికత యందు ముందడుగు వేయఁజాలకున్నది. మొన్న మొన్నటి వఱకును మూఢులుగ నెంచిన విదేశీయులు, ఐకమత్యమున నితరుల నభివృద్ధినొంది, భారతీయులను వెనుకకుఁ ద్రొక్కివేయు చున్నారు! ఇప్పుడైనను కనులు తెఱచి, మనము కర్తవ్యముఁ జూచి కొనవలయును.

"సంఘ సమ్మేళనమున కానశ్యకములగు సంస్కరణములు మన మామోదింప వలయును. ఒకసారిగ జాతులన్నియు నేకము కావలయునని కోరిన లాభము లేదు. మనసు గలియని మమతలు వ్యర్థములు. స్వయంకృషిచేతను విద్యావ్యాపనము మూలమునను అగ్రవర్ణముల తోడి స్నేహ సఖ్యముల వలనను, నిమ్నజాతుల యుద్ధరణము కావలయును.

"ఇవ్విధమున పంచమజాతి యభ్యున్నతికై పాటుబడుటకే వచ్చినారముకాని, మీలో పరస్పర వైరములు పెంచుటకుఁ గాదు. అటుగాక, నేను, ఇంమన్న నామిత్రులును, కపటులము దేశద్రోహులము నని మీకింక ననుమాన మున్నయెడల, మాదుర్నయములకు నా తలగొట్టి వేయుఁడు!" అని నిరంజనశాస్త్రి, రెండుపక్షముల నాయకులయొద్ద కొనఁబోయి, తలయొగ్గి నిలువఁబడెను. "మీరే గురుమంత్రములను జరుప లేదని మాకిపుడు స్పష్టమైనది! మీరు సత్కార్యముతే సాగించు చున్నారు!" అని యుభయులును జెప్పివేసిరి.

"అట్లయిన నేను మీయిరువురికిని సఖ్యుఁడనే కదా! నాకు మీ రుభయులును సోదరసములు. నేఁటి నుండి మీరందఱును స్నేహభావమున మెలఁగుట ధర్మము. అట్లు మీరు చేయనొల్లరేని, మనలో నైకమత్యము కుదరదని నమ్మి నాయుద్యమమును విరమించుకొని, సంసారమును త్యజించి, యడవుల కేగి వెడలి పోయెదను!" అని ధీరత్వమున నిరంజనశాస్త్రి పలికిన వాక్కులు, "యథార్థము" "యథార్థము!" అని సాక్ష్యమిచ్చు చున్నట్టుగ, పరిసర ప్రదేశములందలి వృక్షపంక్తులు మాఱు మ్రోఁగెను! "పోవలదు" "పోవలదు" అని యందఱును కేక లిడిరి; అంత నిరంజనుని కోరిక చొప్పున నుభయపక్షముల నాయకులును ఆదర పూర్వకముగ నొండొరులను సంభావించిరి. వారలమధ్య నిలచియుండు పేరుధీరుఁడగు నిరంజనశాస్త్రి కనుకొనల నుండి, కొండ చరిఁయలనుండి స్రవించు సెలయేటి నీటివలె నానంద బాష్పములు నేల ప్రవహించెను. దయాశీలుఁడగు నాయూరుని గాంచి, కంటనీరు పెట్టని జను లచటఁ గానరారు! మిత్రభావము గలిగి, సుఖ సంభాషణములతో నంత నెవరియిండ్లకు వారు వెడలి పోయిరి.

౧౧

రణరంగమునఁ బరిపూర్ణవిజయ మందిన రాజకుమారుని వలె నిరంజనశాస్త్రి నానాఁడు మిత్రు లభినందనముతో ముంచివైచిరి. ఊరేగింపుతోఁ దమ నాయకునిఁ గొనిపోయి చూపి, జనకుని సమ్మోదమునఁ దేల్పనలె నని వారి సంకల్పము. కాని, నిరంజనుఁడు వారి నివారించి, తమ విజయ మానాఁ డారంభమయ్యెనే కాని ముగియలే దనియును, ఎప్పటివలెఁ దాను నదీజలముల వార్చి, రాత్రి కింటి కేతెంచెద ననియును జెప్పి, వారిని ముందు పంపివేసెను. పరంధామ శాస్త్రికిని తక్కిన వారికిని సంతోషవార్తను వేవేగమె తెలియఁ జేయు నుత్సాహమున వారు తోడ్తోడనె యిండ్లకు వెడలిపోయిరి. రాత్రి వఱకును దనను గాచి యుండునని చెప్పిన లక్ష్మణస్వామిని జూచి నిరంజనుఁడు చిరునవ్వునవ్వి, "లక్ష్మణా! నన్ను గురించి నీవు భయపడ నక్కఱలేదు. పంచమాశ్రమమునకు ముప్పు వాటిల్లకుండ మాత్రము కాచి కొనుము! అన్ని శుభములు చేకూరఁగలవు!" అని వానిని పంచమాశ్రమమున కంపివేసెను. ఆనాఁటి సంగతు లొక్కొక్కటియె మననము చేసి కొనుచు, నిరంజనుఁ డంత నదీతటమును సమీపించెను.

అప్పుడు సూర్యాస్తమయ సమయ మయ్యెను. భాను బింబము జేవుఱుముద్దవలె పశ్చిమ దిశఁ గ్రుంకుచు, భూలోకయాత్ర చాలించి పరలోక మేగెడి జీవుని సామ్యమును నిరంజనుని మనమునకు దోఁపించెను. ఒకవేళ తనకా నాఁడె మృత్యువాసన్నమగు నెడల, ఎట్లు లోక ధర్మములు నిర్వహించెనో చూచు కొనుట కిదె యద నని తలంచి, ఆయునకుఁడు దనజీవిత విమర్శనముఁ జేసికొనెను. ఇపుడాతఁడు గట్టు దిగి, నదిలోని కడుగులు వెట్టుచు, "జీవితమందలి యాశ యంతము లేనిదిగదా! ఈనదీప్రవాహము పోయిపోయి, కడకుఁ గడలి నెట్లు కలియునో, నాచైతన్యమును చైతన్యమూర్తిని జేరి శాంతినొందఁ గలదు సుమీ!" యని తలపోయుచు, చెట్టు మొదట నుత్తరీయము వైచి, నీటియొద్దున సంధ్యావందనము నెఱపి, జనకుని బోధన ననుసరించి మౌనముద్రమూని, నారాయణస్మరణ చేసికొనుచుండెను.

అంతట నీటిమీఁద వ్రాలిన యొక పెద్దకొమ్మ పెళపెళమని యెను. తోడనే కొండంతబరువగు నాయుగము తనశిరమును ఛిన్న

భిన్నములుగఁ జేయుచున్నట్టుగ నిరంజనునికిఁ దోచెను. మరల పరమాత్మ తీగమెఱుపువలె నాతని శివాత్మ మేలుకొని, "ఇదిరా కాఁబోలు మబ్బులేని పిడుగ"ని యచ్చెరువంది, ప్రాణోత్క్రమణ సమయ మగు టెఱింగి సమాధినుండి ధ్యాన నిమగ్న యయ్యెను. చెట్టుకొమ్మనుండి యాటి న గోపాలగోవిందులు, తమ మాయావ్యూహమును భేదించుకొని వచ్చిన వీరునిమీఁదఁ గసిదీఱక, అగ్రహావేశమునఁ గావించిన ప్రహారణములచే వాని కళేబరము నీటిలోని కొరఁగి నదీదేవతకు ప్రణమిల్లునట్టుగ ముందుకుఁ బడి పోయెను. మెఱుపుమెఱుపునఁ గ్రుంకిపోయెను! చిమ్మచీఁకటులు జగతినంతయు నలముకొని, క్రూరాత్ములిట్టి సల్పు ఘోరకృత్యములు గప్పిపుచ్చుటకై కూటనాట్యములు గుర్గుర్చుచున్నవా యనునట్టుగ, వస్తుజాలమును గలుగుపఱచుచుండెను. అంత నంబరతల మధిష్ఠించిన తారకరాజముల సుఖదీప్తులు పుడమి నెన్నటికైన నిజము బయలుపడి, సత్యధర్మముల కమోఘవిజయము గలుగుట తథ్యమని ప్రకటించుచుండెనా యనునట్లు, మినుకుమినుకుమని గగనస్థలమున మందహాసములతో విహరింపసాగెను!



నీటియొడ్డున సంధ్యావందనము సలిపి...... మౌనముద్రనూని నారాయణస్మరణ చేసుకొనుచుండెను.

---

## అజంతా చిత్రములు




౨. తత్త్వబోధ